దసరా బ్రహ్మోత్సవం

- దేవీచౌక్‌లో ఉత్సవాలు ప్రారంభం
- వైభవంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ
- తొమ్మిది రోజులు ప్రత్యేక పూజలు
- ఆకట్టుకుంటున్న విద్యుత్ సెట్టింగ్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): దసరా వచ్చిందంటే సందడే సందడి. చిన్నపిల్లల నుంచి పెద్దవాళ్ల వరకూ ఉత్సాహంగా ఉంటారు. దసరా అనగానే రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో జరిగే ఉత్సవాలు గుర్తుకువస్తాయి. తొమ్మిది రోజుల పాటు అక్కడ తిరునాళ్ల సందడి నెలకొంటోంది. దేవీచౌక్‌లో బాలాత్రిపుర సుందరీదేవి శరన్నవరాత్ర ఉత్సవాలు శనివారం రాత్రి 9.36 గంటల నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజులు పాటు వైభవంగా అమ్మవారికి విశేష అలంకరణలు చేసి, పూజలు నిర్వహిస్తారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి.

1934 ప్రారంభమైన వేడుకలు

రాజమహేంద్రవరానికి చెందిన బత్తుల కామరాజు, బత్తుల మునియ్య కలకత్తాకు చింతపండు వ్యాపారం కోసం తరచూ వెళ్లి వస్తుండేవారు. దసరా సమయంలో కలకత్తాలో జరిగే దేవీ నవరాత్ర ఉత్సవాలను చూసి ఆశ్చర్యపోయారు. అలా అమ్మవారి ఉత్సవాలను మన నగరంలోనూ చేయాలని నిశ్చయించుకున్నారు. 1934లో నగరంలోని మూడు లాంతర్ల సెంటర్‌లో అమ్మవారి ఉత్సవాలను ప్రారంభించారు. 1960లో అమ్మవారి పాలరాతి విగ్రహన్ని అప్పటి మున్సిపల్ చైర్మన్ నిడమర్తి వెంకట నరసింహరావు ఆధ్వర్యంలో మూడు లాంతర్లు సెంటర్‌లో ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ఆ సెంటర్ దేవీచౌక్ సెంటర్‌గా ప్రసిద్ధి కెక్కింది.


దేవీచౌక్‌లో అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు

నాటకాలు ఎంతో ప్రసిద్ధి

దసరా ఉత్సవాల సందర్భంగా దేవీచౌక్ సెంటర్‌లో ప్రదర్శించే నాటకాలకు మంచి స్పందన ఉంటుంది. రాత్రి ప్రదర్శించే నాటకాన్ని తిలకించడానికి జనంతో పాటు సినీతారలు కూడా వస్తారు. విద్యుత్ దీపాల అలంకరణ ఇక్కడ ఎంతో ఆకట్టుకుంటుంది. 90 ఏళ్లుగా బాలా త్రిపుర సుందరీదేవి అమ్మవారి శరన్నవరాత్ర ఉత్సవాలను కమిటీ క్రమం తప్పకుండా నిర్వహిస్తోంది. ఇక్కడ ప్రదర్శించే నాటకాలకు రాష్ట్ర వ్యాప్తంగా పేరు రావడంతో ఒక్కసారైనా ఇక్కడ నటించాలని ప్రతి కళాకారుడు కోరుకునేవాడు. రామాంజనేయ యుద్ధం, శ్రీకృష్ణ తులాభారం, చింతామణి, బొబ్బిలి యుద్ధం, మహాకవి కాళిదాసు, సత్యహరిశ్చంద్ర, బాల నాగమ్మ, కురుక్షేత్రం వంటి నాటకాలలో ప్రసిద్ధ రంగస్థల నటులు నటించారు. సురభి ప్రదర్శించే నాటకాలలో ఫైర్ సెట్టింగ్‌కూ పెద్ద పేరు ఉండేది.


సత్యహరిశ్చంద్ర నాటకంలో ఓ సన్నివేశం(ఫైల్)

తరలివచ్చిన సినీతారలు

ఎస్వీ రంగారావు, అక్కినేని నాగేశ్వరరావు, గుమ్మడి వెంకటేశ్వరరావు, జమున, ప్రభాకర రెడ్డి, రేలంగి, అంజలీదేవి, ఆదినారాయణరావు, సత్యనారాయణ, జి.వరలక్ష్మి, సావిత్రి, జెమినీ గణేష్, కృష్ణ, శారద, చలం, గీతాంజలి, రాజబాబు వంటి తదితర తెలుగ తారలే కాకుండా సునీల్ దత్ వంటి హిందీ నటులు కూడా ఇక్కడ నాటకాలను తిలకించారు. సుబ్బిసెట్టి నాటకంలో సుబ్బిసెట్టిగా పద్మనాభం, బాల నాగమ్మలో మాయల ఫకీర్‌గా రాజనాల నటించారు. 1966, 68 సంవత్సరాలలో రాజ సులోచన ఇక్కడ నాట్యం చేశారు.

మహోత్సవాలు ప్రారంభం

దేవీచౌక్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వేదికపై శనివారం రాత్రి 9.36 గంటలకు అమ్మవారిని వేద మంత్రాలతో ప్రతిష్ఠించారు. ఆదివారం ఉదయం 8.49 గంటలకు కలశస్థాపనతో లాంఛనంగా ప్రారంభిస్తారు. తొలిరోజు అమ్మవారు స్వర్ణ కవచ కనక దుర్గాదేవి అవతారంలో కనిపించనున్నారు. రాత్రి 10 గంటలకు హైదరాబాద్ నవ క్రాంతి బృందం కనకదుర్గ మహత్మ్యం నాటకాన్ని ప్రదర్శిస్తుంది.

షణ్ముక ఆంజనేయరాజు, పీసపాటి నరసింహమూర్తి, సూరవరపు వెంకటేశ్వర్లు, కాగితం సుబ్బారావు, లక్ష్మణరావు, సీఎస్ఆర్ అంజనేయులు, ద్వారంపూడి సూర్యరావు వంటి దిగ్గజాలు ఇక్కడ నాటకాలలో తమ ప్రతిభను ప్రదర్శించేవారు.

విశేష పూజలు



రాష్ట్ర వ్యాప్తంగా ప్రసిద్ధి గాంచిన దేవీచౌక్‌లోని అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు వేలాదిగా తరలివస్తారు. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేశాం. నిత్యం ఉదయం నుంచి కుంకుమ పూజలు, అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తాం. దసరా తొమ్మిది రోజులూ నాటక ప్రదర్శనలను ఏర్పాటు చేశాం.

– బత్తుల రాజరాజేశ్వరరావు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు

తెల్లారేవరకూ నాటక ప్రదర్శన



1958లో బుర్రకథలు, హరికథలు వినిపించేవారు. తర్వాత సురభి వారు నాటకాలను ప్రదర్శించడంతో జనం బాగా చూడడానికి వచ్చేవారు. రాత్రి 8 గంటలకు ప్రారంభం అయిన నాటకం వన్స్ మోర్ పద్యాలతో ఉదయం 6 గంటల వరకూ సాగేది. ఇన్ని గంటలు సాగినా జనం విసుక్కునే వారు కాదు.

– బత్తుల ఈశ్వరరావు, ఉత్సవ కమిటీ కోశాధికారి

ఆదరణ తగ్గలేదు



దేవీచౌక్ అంటే దసరా ఉత్సవాలకు ఎలా పేరు వచ్చిందో, ఇక్కడ నాటకాలకు కూడా అంతే పేరు వచ్చింది. నాటకాలు అంతరించిపోతున్న ఈ సమయంలో ఇంకా ఇక్కడ స్టేజీ మీద నాటకాలు వేయడానికి పలువురు ఆసక్తి చూపుతున్నారు. వాటిని చూడటానికి జనం తరలివస్తున్నారు.

– పడాల సూర్య కోటేశ్వరరావు, కార్యదర్శి

వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయాలి


చందన రమేష్ దంపతులతో మాట్లాడుతున్న మిథున్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ భరత్ రామ్, చందన నాగేశ్వర్, జక్కంపూడిరాజా


షేక్ జానీని వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ మిథున్ రెడ్డి, చిత్రంలో మంత్రి వేణు తదితరులు

- రీజినల్ కోఆర్డినేటర్ మిథున్‌రెడ్డి
- చందన రమేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన వైనం

రాజమహేంద్రవరం రూరల్: రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయాలని ఆ పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన రాజమహేంద్రవరంలో రూరల్ మాజీ ఎమ్మెల్యే చందన రమేష్ దంపతులను పార్టీ నేతలతో మర్యాదపూర్వకంగా కలిశారు. చందన రమేష్‌ను, ఆయన కుటుంబ సభ్యులను ఆత్మీయంగా పలకరించారు. అనంతరం ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్‌ను రూరల్ నియోజకవర్గ పార్టీ పరిస్థితిపై ఆరా తీశారు. రాబోయే ఎన్నికలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని, నియోజకవర్గంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంతో పాటు, వై ఏపీ నీడ్స్ జగన్, త్వరలో జరగబోయే సామాజిక బస్సుయాత్ర కార్యక్రమాలను విజయవంతం చేయాలని మిథున్ రెడ్డి సూచించారు. పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఎంపీ మార్గాని భరత్ రామ్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, రుడా మాజీ చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, పార్టీ యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్, రీజినల్ ఇన్‌చార్జి జక్కంపూడి గణేష్, పాలిక శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి చేరిక

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి వచ్చిన మిథున్‌రెడ్డి, మంత్రి చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ సమక్షంలో నగరానికి చెందిన వక్ఫ్‌బోర్డు మాజీ ప్రెసిడెంట్, టీడీపీ నాయకుడు షేక్ జానీ వైఎస్సార్ సీపీలో చేరారు. మిథున్‌రెడ్డి మాట్లాడుతూ జానీ చేరికతో పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. జానీ మాట్లాడుతూ సీఎం జగన్ సంక్షేమ పథకాలు నచ్చి పార్టీలో చేరినట్టు తెలిపారు.

దసరా వేడుకలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి మహోత్సవాలు
- ముస్తాబైన ఆలయాలు


విజయ కనక దుర్గాదేవి


మోరంపూడి సాయినగర్‌లోని ఆలయం వద్ద విద్యుత్ అలంకరణ

రాజమహేంద్రవరం రూరల్: దసరా నవరాత్ర ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. ఆయా గ్రామాల్లో ఆయా కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. మోరంపూడి సాయి నగర్‌లోని విజయ కనకదుర్గాదేవి ఆలయంలో ఆదివారం నుంచి తొమ్మిది రోజులు పాటు 33వ శరన్నవరాత్ర ఉత్సవాలు జరగనున్నాయి. ఆలయ గౌరవ అధ్యక్షుడు పిల్లి శ్రీను నేతృత్వంలో తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరిస్తామని ఆలయ ధర్మకర్త మేడి త్రిమూర్తులు తెలిపారు. ఆలయంతో పాటు, రహదారికి ఇరువైపులా చేసిన విద్యుద్దీపాలంకరణ ఆకట్టుకుంది. బాలాజీపేట సెంటర్‌లోని విజయ కనక దుర్గాదేవి, బొమ్మూరు జాతీయ రహదారి పక్కన కనక దుర్గాదేవి, రాజవోలు రోడ్డులోని కనక దుర్గాదేవి, నాగదుర్గాదేవి, కొంతమూరు బీసీ కాలనీలోని దుర్గాదేవి ఆలయాలతో పాటు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన పందిళ్లలోను అమ్మవార్లకు ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

కడియం: మండల కేంద్రమైన కడియంలోని దేవీఅమ్మవారి ఆలయం, దుళ్లలోని శారదా అమ్మవారి ఆలయంతో పాటు, మురమండ, వీరవరం, మాధవరాయుడుపాలెం, పొట్టిలంక, కడియపుసావరం, వేమగిరి గ్రామాల్లోని ఆలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ తొమ్మిది రోజులు విశేష పూజలు జరుగుతాయని ఆయా ఆలయాల ఉత్సవ కమిటీలు తెలిపాయి. అలాగే ఆలయాలను విద్యుద్దీపాలంకరణలతో సుందరంగా తీర్చిదిద్దారు. పలు చోట్ల సాంస్కృతిక ప్రదర్శనలకు ఏర్పాట్లు చేశారు.

ఇంటింటా సంక్షేమ వెలుగులు

బిక్కవోలు: ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ఇంటింటా వెలుగులు నిండుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని బిక్కవోలులో శనివారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేకు గడప గడపలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓ వైపు అభివృద్ధి కొనసాగిస్తూనే మరోవైపు నిరంతరాయంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రభుత్వం పథకాలు అందజేస్తోందన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో అభివృద్ధికి రూ.20 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. సచివాలయాల ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు అందజేస్తున్న ఘనత సీఎం జగన్‌దేన్నారు. రాబోయే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకుందామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సరెళ్ల సుమలత, ఉప సర్పంచ్ జంగా మురళీకృష్ణారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ జంగావీర వెంకట సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ చైర్మన్ రొంగల అప్పాజీ, గువ్వల సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల పక్షపాతి సీఎం జగన్


పోస్టర్లను పంపిణీ చేస్తున్న వక్ఫ్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు ఆరిఫ్

- వక్ఫ్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు ఆరిఫ్
- ఉత్సాహంగా 'హమ్‌సబ్ జగన్‌కే సాత్'

సీటీఆర్ఐ: ముస్లిం మైనార్టీల పక్షపాతి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని వక్ఫ్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఆరిఫ్ అన్నారు. హర్ దిల్ మే వైఎస్సార్ – హమ్ సబ్ జగన్‌కే సాత్ కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, పార్టీ మైనారిటీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వి.ఖాదర్ బాషా ఆదేశాల మేరకు ఆయన శనివారం నగరంలోని పలు మసీదులను సందర్శించారు. ఈ సందర్భంగా మసీదు కమిటీ సభ్యులు, స్థానిక ముస్లింలతో సమావేశాలు నిర్వహించి పోస్టర్లు పంపిణీ చేశారు మహమ్మద్ ఆరిఫ్ మాట్లాడుతూ ఉర్దూకు రెండో అధికారభాష హోదా కల్పించడంతో పాటు, గతంలో రూ.8 వేలు ఉన్న మసీదు ఇమాం, మౌసన్‌ల జీతాలను రూ.15 వేలకు పెంచి జగన్ తన పెద్ద మనసును చాటుకున్నారన్నారు. వక్ఫ్ భూములను సంరక్షించడంతో పాటు కర్నూలులో వక్ఫ్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి వక్ఫ్ ఆస్తుల రక్షణకు చేపట్టిన ముందస్తు చర్యలను ముస్లిం మైనారిటీలు హర్షిస్తున్నారని అన్నారు. మసీదుకు సంబంధించి, ముస్లింలకు స్థానికంగా ఉన్న అవసరాలు ఏమిటో అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక మసీదుల వద్ద నెలకొన్న సమస్యలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు జిల్లా డైరెక్టర్లు సయ్యద్ రబ్బానీ, షట్టర్ బాషా, మాజీ అధ్యక్షులు కరీం ఖాన్, నగర మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఆరీఫుల్లాఖాన్, నగర ఉపాధ్యక్షుడు సయ్యద్ అల్తాఫ్ పాల్గొన్నారు.

సంపూర్ణ భారత యాత్ర విజయవంతం


బదరీ నారాయణ బృందానికి స్వాగతం పలికిన నాట్యాచార్యులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాధాకృష్ణ కళాక్షేత్రం ఆధ్వర్యంలో చైర్మన్ జీ.బదరీ నారాయణ నేతృత్వంలో ఆగస్టు 11 నుంచి ఈ నెల 12వ తేదీ వరకూ చేపట్టిన సంపూర్ణ భారత యాత్ర విజయవంతమైంది. ఆ బృందానికి శనివారం స్థానిక కోటిపల్లి బస్టాండ్ వద్ద నాట్యచార్యులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బదరీ నారాయణ మాట్లాడుతూ శాస్త్రీయ నృత్యం, సంగీతం, గానంతో భారతీయ సనాతన ధర్మాన్ని పునరుత్తేజం చేయాలనే లక్ష్యంతో సంపూర్ణ భారత యాత్ర చేపట్టి దిగ్విజయంగా పూర్తిచేశామన్నారు. అన్ని రాష్ట్రాల్లో తమపై ప్రతిచోటా పూల వర్షం కురిపించారని, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. తనతో పాటు ఏడుగురు నాట్య విద్యార్థులతో యాత్ర జరిగిందన్నారు. కలెక్టర్ మాధవీలత, నగరపాలకసంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ సంయుక్త ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం నుంచి ఈ యాత్ర ప్రారంభమై ఎలాంటి అవాంతరాలు లేకుండా పూర్తి చేశామని వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం ఆనం కళాకేంద్రంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో ముగింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రాధాకృష్ణ కళాక్షేత్రం కార్యదర్శి గోరుగొంతు ఉమా జయశ్రీ, డైరెక్టర్ జి.లక్ష్మీదీపిక, నాట్యాచార్యులు పాల్గొన్నారు.

చంద్రబాబుపై కుట్ర

సీటీఆర్ఐ: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ఆరోగ్య పరిరక్షణకు సరైన చర్యలు తీసుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని మాజీ మంత్రి కేఎస్ జవహర్ అన్నారు. ఆయన శనివారం సెంట్రల్ జైల్ వద్ద మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ చంద్రబాబుపై కుట్ర జరుగుతుందని ఆరోపించారు. మాజీ మంత్రి పీతల సుజాత తదితరులు ఉన్నారు.

దసరా వెలుగులు

శరన్నవరాత్ర శోభతో రాజమహేంద్రవరం మెరిసిపోతోంది. దేవీచౌక్‌లోని వేదికపై శనివారం రాత్రి 9.36 గంటలకు అమ్మవారిని ప్రతిష్ఠించారు. దీంతో దసరా సందడి మొదలైంది. దేవీచౌక్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సెట్టింగులు, విద్యుత్ దీపాలంకరణ ఎంతో ఆకట్టుకుంటున్నాయి. వాటిని చూడటానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

– సీటీఆర్ఐ


విద్యుత్ దీపాలంకరణలో దేవీచౌక్ అమ్మవారి ఆలయం, ఆకట్టుకుంటున్న సెట్టింగ్‌లు







టీడీపీ సమావేశం

కడియం: ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అధ్యక్షతన కడియంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జులు, బూత్ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షుడు వెలుగు బంటి రఘురామ్ అధ్యక్షత వహించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు.

క్లుప్తంగా

ట్రెంచ్ పనులను సద్వినియోగం చేసుకోవాలి

రంగంపేట: ఉపాధి హామీ పథకం ద్వారా వండ్ల తోటల్లో మొక్కల చుట్టూ ఏర్పాటుచేస్తున్న రింగ్ ట్రెంచ్ పనులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న అన్నారు. ఈలకొలను గ్రామ సచివాలయంలో సర్పంచ్ చింతపల్లి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఉపాధి గ్రామసభకు ఆయన హాజరై మాట్లాడారు. అనంతరం ఉపాధి హామీ పథకంలో భాగంగా 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోయే పనుల గురించి గ్రామసభలో చర్చించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాయుడు రాంబాబు, ఏపీఓ జి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చెరువులో చేప పిల్లల విడుదల

రంగంపేట: మండలంలోని పెదరాయవరం జగ్గరాజు చెరువులో స్థానిక ఫిషర్‌మెన్ సొసైటీ సభ్యులు శనివారం చేప పిల్లలను విడుదల చేశారు. అనంతరం ఫిషర్‌మెన్ సొసైటీ అధ్యక్షుడు బచ్చల గంగరాజు మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా పలు గ్రామాల్లోని మైనర్ ఇరిగేషన్ చెరువుల్లో 40,300 చేప పిల్లలను విడుదల చేసే కార్యక్రమం చేపట్టడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో ఫిషర్‌మెన్ సొసైటీ ఉపాధ్యక్షుడు రొంప ప్రసాద్, బరగటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కబడ్డీ జట్టుకు ఎంపిక

పెదపూడి: కాకినాడ జిల్లా కేంద్రంలోని క్రీడా మైదానంలో జరిగిన అండర్–14 కబడ్డీ ఎంపికల్లో సంపర జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు దూళ్ల చిన్న, ఏరుబండి రాము అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని హెచ్ఎం త్రిమూర్తులు, పీఈటీ శ్రీనివాస్ శనివారం తెలిపారు. విద్యార్థులను సర్పంచ్ అద్దంకి మాచరమ్మ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ సలాది విమల, ఎంపీటీసీ సభ్యుడు శ్రీరామచంద్రమూర్తి, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ మట్టా రామలయ్యన్న తదితరులు అభినందించారు.

కొనసాగుతున్న ఉమెన్ మెడికోస్ గేమ్స్

రాజానగరం: డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ పరిధిలోని మెడికల్, డెంటల్ కళాశాలల విద్యార్థినులకు స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న ఉమెన్ మెడికోస్ ఆటల పోటీలు రెండోరోజైన శనివారం కూడా కొనసాగాయి. ఆదివారం ఫైనల్స్ జరగనున్నాయి. వాలీబాల్, బాస్కెట్ బాల్, త్రోబాల్, షటిల్ బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, టెన్నిస్, టేబుల్ టెన్నిస్, చెస్ తదితర వాటిలో 450 మంది విద్యార్థినులు పోటీపడుతున్నారని యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ ఈ.త్రిమూర్తి, కాలేజీ పీడీ శ్రీనివాసులు తెలిపారు.

అనపర్తిలో అగ్నిప్రమాదం

అనపర్తి: స్థానిక మెయిన్ రోడ్డులోని గాంధీబొమ్మ సెంటర్ సమీపంలో గల మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్‌లో షాప్ నెంబరు 24, 25ల్లో నిర్వహిస్తున్న టిఫిన్ హోటల్‌లో శనివారం అగ్ని ప్రమాదం జరిగింది. అనపర్తి అగ్నిమాపక కేంద్రం అధికారి జె.శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ద్వారంపూడి వెంకటరామారెడ్డికి చెందిన జానకిరామయ్య టిఫిన్ హోటల్‌లో శనివారం గ్యాస్ లీకేజీ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించింది. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేయడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాదంలో సుమారు రూ.75 వేల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక అధికారి జె.శ్రీనివాసరెడ్డి తెలిపారు.

నిబంధనలు పాటించాలి

సీతానగరం: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు నిబంధనలను పాటించాలని, వాటిని అధిగమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంఈవో కె.స్వామినాయక్ హెచ్చరించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 24 వరకు దసరా సెలవులు ఉన్నాయని, సెలవుల సమయంలో అదనపు తరగతులు, స్పెషల్ క్లాసులు జరపరాదన్నారు. సిలబస్ పూర్తి కాలేదనే నెపంతో స్టాఫ్ మీటింగ్‌లు, వర్క్‌షాప్, రిజిస్టర్ వర్క్ పేరులతో అదనపు తరగతులు నిర్వహిస్తే ఆ విద్యాసంస్థలపై చర్యలు తీసుకుంటామన్నారు.

దసరాకు ప్రత్యేక బస్సు సర్వీసులు

గోకవరం: దసరా పండగను పురస్కరించుకుని గోకవరం ఆర్టీసీ డిపో నుంచి వివిధ ప్రాంతాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ యు.రామన్నదొర తెలిపారు. స్థానిక ఆర్టీసీ డిపోలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గోకవరం డిపో నుంచి విజయవాడ, శ్రీశైలం, భద్రాచలం వంటి పుణ్యక్షేత్రాలకు దసరా సెలవుల్లో ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నామన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ధ్రువపత్రాల అందజేత

బిక్కవోలు: మండలంలోని కాపవరంలో టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్పంచ్ సత్యంశెట్టి వెంకటరమణ ధ్రువపత్రాలను శనివారం అందజేశారు. కాపవరంలో డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ద్వారా టైలరింగ్, మగ్గం వర్క్‌లో 70 మంది శిక్షణనిచ్చామని ఫౌండేషన్ మేనేజర్ సుంకర నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు వీరాస్వామి, వినీల, హేమనళిని తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల : మ్యాడ్
సూర్యమినీ : మార్క్‌ఆంటోని
సూర్యప్యాలెస్ : ది ఎగ్జార్సిస్ట్
స్వామి : స్కంద
శివజ్యోతి : యూనివర్సిటీ, నగిలేటికథ, రాక్షసకావ్యం
అనుశ్రీ : రూల్స్‌రంజన్
రాజా : రతినిర్వేదం
అశోక : గాడ్
ఊర్వశి : చిన్నా
రంభ: మిస్‌శెట్టి మిస్టర్ పోలిశెట్టి
మేనక : చంద్రముఖి–2
అప్సర : మ్యాడ్, స్కంద

నామవరం
వీఎస్ మహల్ : స్కంద

ధవళేశ్వరం
మురళీకృష్ణ : మ్యాడ్

కడియం
వెంకటసూర్య : గాడ్